

అన్నదాన పథకానికి రూ.రెండు లక్షలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చింతల అప్పలనాయుడు. మురళీకృష్ణ, ధనలక్ష్మి, రామకృష్ణ, మాధురి (విశాఖపట్నం) రూ.రెండు లక్షల విరాళాన్ని మంగళవారం అందజేశారు.




ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్టు

కె.గంగవరం మండలం అద్దంపల్లి సమీపంలో ఈనెల 3న దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ఎం.వెంకట నారాయణ వెల్లడించారు.

8 లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 3,96,603 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ట్రంప్ సుంకాలతో ఆక్వా అతలాకుతలం



విజయవాడ ఆక్వా సదస్సుకు రావాలని అమలాపురంలో రైతులను ఆహ్వానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో మన రాష్ట్రంలోని ఆక్వా రంగం అతలాకుతలం అవుతోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించేందుకు ఈ నెల 11న విజయవాడలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆక్వా రైతు సదస్సుకు జిల్లా నుంచి ఆక్వా రైతులు హాజరు కావాలని కోరారు. స్థానిక ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో మంగళవారం రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు, కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు ఈ విషయంపై సమావేశమయ్యారు. అనంతరం విజయవాడ ఆక్వా రైతు సదస్సుకు హాజరుకావాలంటూ పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ఆక్వా రైతులను స్వయంగా కలసి మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ తదితరులు ఆక్వా రైతులను సదస్సుకు ఆహ్వానించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే ఈ సుంకాల విధింపుపై స్పందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

12, 13 తేదీల్లో ఆటోల బంద్



మురమళ్లలో ఆటో డ్రైవర్ల నిరసన

అమలాపురం టౌన్: స్త్రీ శక్తి పథకం పేరుతో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంలో ఆటోలకు గిరాకీ లేకుండా పోయింది. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు కలుగుతుండడంతో జిల్లాలోని ఆటో డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగా తమ జేబులకు నల్ల బ్యాడ్జీలు, ఆటోలకు నల్ల జెండాలు కట్టి నిరసన తెలుపుతున్నారు. అలాగే ఈ నెల 12, 13వ తేదీల్లో ఆటోలను పూర్తిగా నిలిపివేసి బంద్ పాటించనున్నారు. ఆ రెండు రోజులూ 24 గంటల పాటు సామూహిక నిరాహార దీక్షలు చేపడతారు. ఆంధ్ర ఆటోవాలా జిల్లా శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 25 వేల ఆటోలు ఉన్నాయి.

మెప్మా కార్యకలాపాలపై సమీక్ష

అమలాపురం టౌన్: జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అమలు చేస్తున్న కార్యకలాపాలపై స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని మెప్మా కార్యాలయంలో ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) డి.పెంచలయ్య మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అన్ని సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు అందేలా మెప్మా సిబ్బంది కృషి చేయాలన్నారు. వాణిజ్య బ్యాంకుల్లో తీసుకునే రుణాలు, లైవ్లీ హుడ్ యూనిట్ల రికవరీపై చర్చించారు. సమావేశంలో ఐబీ మోహన్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, నాలుగు మున్సిపాలిటీల సీఎంఎంలు, సీవోలు, డీఈవోలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

11 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అమలాపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా రేషన్ డిపోల వద్ద ఈ నెల 11 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22 మండలాలకు సుమారు 5,31,926 కార్డులు వచ్చాయని, వాటిని సంబంధిత తహసీల్దార్లకు అప్పగించామన్నారు. రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగుల సమన్వయంతో ఈ నెల 11 నుంచి సంబంధిత మంత్రులు, ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధుల సమక్షంలో డిపోలకు పంపిణీ చేస్తారన్నారు. తదుపరి రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

రాజమహేంద్రవరం సిటీ: అరుణాచలం, రామేశ్వరం యాత్రకు రాజమహేంద్రవరం డిపో నుంచి మంగళవారం స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సు 30 మంది భక్తులతో బయలుదేరి వెళ్లిందని డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. ఈ యాత్రలో 9 రోజుల పాటు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కోయంబత్తూర్, కుంభకోణం, చిదంబరం, గురువాయూర్, త్రివేంద్రం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, తంజావూరు వంటి 14 పుణ్యక్షేత్రాలు దర్శించుకొని తిరిగి 18వ తేదీ రాజమహేంద్రవరం డిపోకు చేరుకుంటుందన్నారు.



కొత్తపేటలో పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, పి.గన్నవరం కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీ అనూరాధ తదితరులు



అమలాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు సూర్యారావు, సతీష్ కుమార్, శ్రీకాంత్, పార్టీ నాయకులు

పోరుబాట

- అన్నదాత పోరు విజయవంతం
- కూటమి రైతు వ్యతిరేక విధానాలపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- యూరియా బ్లాక్ మార్కెట్ పై మండిపాటు
- కొత్తపేట, అమలాపురం, రామచంద్రపురాల్లో నిరసనలు
- రైతు సంఘాల ప్రతినిధులు, రైతుల మద్దతు



రామచంద్రపురం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

సాక్షి, అమలాపురం: మడిలో తడబడుతున్న అన్నదాతకు దన్నుగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కాయి. తొలకరి పంట మధ్యలో ఎరువులు అందక, ముఖ్యంగా యూరియా దొరకపోవడంతో అష్టకష్టాలు పడుతున్న రైతులకు అండగా నిలిచేందుకు ముందుకురికాయి. ప్రకృతి వైపరీత్యాలకు సైతం ఎదురొడ్డి నిలబడుతున్న రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, సహాయ నిరాకరణకు నష్టపోతున్న తరుణంలో రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు జిల్లాలో విజయవంతమైంది. అన్నదాతకు అండగా నిలబడాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని కొత్తపేట, అమలాపురం, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద నిరసనలు హోరెత్తాయి. అయితే కూటమి ప్రభుత్వం నిరంకుశ వైఖరితో ఈ ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని పలు ఆంక్షలు విధించింది. నిబంధనల పేరుతో అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. అయినా వైఎస్సార్ సీపీ శ్రేణులు లెక్క చేయకుండా అన్నదాత పోరును విజయవంతం చేశాయి.

అమలాపురంలో..

అన్నదాత పోరులో భాగంగా అమలాపురం పట్టణంలో పార్టీ నాయకులు బైక్ ర్యాలీ, ధర్నాలతో నిరసనలు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్, రాజోలు, ముమ్మిడివరం, అమలాపురం నియోజక వర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. భట్నవిల్లిలోని పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ ఇంటి నుంచి మూడు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, రైతులు కలిసి ఆర్డీవో కార్యాలయం రోడ్డు వరకూ బైక్ ర్యాలీతో తరలివచ్చారు. వీరంతా ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం వినతి పత్రం అందించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రభుత్వం దళారులను ప్రోత్సహించి ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు మాట్లాడుతూ రైతాంగాన్ని ప్రభుత్వం ఎరువుల కొరతతో నట్టేట ముంచిందని ఆరోపించారు. సూర్యారావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేల ద్వారా రైతులను అన్ని విధాలా ఆదుకుంటే.. కూటమి ప్రభుత్వం అదే రైతాంగాన్ని అడుగడుగునా వంచిస్తోందన్నారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వమే పరోక్షంగా ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు జరిగేలా ప్రోత్సహించిందన్నారు. జిల్లా పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





కొత్తపేటలో వైఎస్సార్ సీపీ శ్రేణులను నిలువరించడంపై డీఎస్పీని ప్రశ్నిస్తున్న జగ్గిరెడ్డి

అడుగడుగునా అడ్డంకులు

వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరుకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. పోలీసులను ఉపయోగించి అణిచివేయాలని చూసింది. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట ఆర్డీవో కార్యాలయాల సమీపంలో బారికేడ్లు పెట్టి కార్యకర్తలను, రైతులను నిలువరించింది. డ్రోన్లు, వీడియో కెమెరాలు, సెల్ ఫోన్లలో వీడియోలు తీస్తూ నిఘా పెట్టింది. ఆర్డీవో కార్యాలయం వద్దకు 25 మంది మించి వెళ్లడానికి లేదని అడ్డుకుంది. అన్ని రకాలుగా అన్నదాత పోరును విఫలం చేయాలని చూసింది. కొత్తపేటలో డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసు అన్నదాత పోరును అడ్డుకున్నా రు. తొలుత జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి బాబీని రావులపాలెంలో పోలీసులు అడ్డుకున్నారు. కొత్తపేటలో పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్ రాజు ఇంటి వద్ద, ఆర్డీవో కార్యాలయం చెంత మరోసారి అడ్డుకున్నారు. రోప్ పార్టీతో కార్యకర్తలను నిలువరించారు. కేవలం 40 మందికే అనుమతి ఉందని అడ్డుకునే ప్రయత్నం చే శారు. స్పెషల్ ఫోర్స్ సిబ్బందితో మరోసారి అడ్డుకోగా పోలీసుల ఆంక్షలు, చర్యలకు నిరసనగా జగ్గిరెడ్డి రోడ్డుపై బైఠాయించారు. అమలాపురం ఎర్ర వంతెన వద్ద, ఎన్టీఆర్ మార్గ్‌లో రెండు చోట్ల పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులను అడ్డుకున్నారు. కేవలం 25 మంది నాయకులను మాత్రమే ఆర్డీవో కార్యాలయం వినతి పత్రం అందించేందుకు అనుమతించారు.

కొత్తపేటలో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, యూరియా కొరతపై కొత్తపేటలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి రామారావు (బాబీ), మాజీ ఎంపీ చింతా అనూరాధ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవితో పాటు పార్టీ శ్రేణులు కొత్తపేటలో పాదయాత్రగా ఆర్డీవో కార్యాలయం వరకు తరలి వచ్చారు. యూరియా బస్తాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో పి.శ్రీకర్‌కు వినతిపత్రం అందజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళారులతో కలిసి యూరియాను అధిక ధరలకు విక్రయాలు చేయడం ద్వారా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకూ దోపిడీ చేసిందని ఆరోపించారు. గత సీఎం జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఉచిత పంటల బీమా పథకం అమలు చేయడం వల్ల ఒక్క కోనసీమలోనే రూ.348 కోట్లు బీమా చేస్తే ఆ డబ్బంతా నియోజవర్గాల్లో రైతులు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ కూటమి ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ చేయకపోవడంతో రైతులు నష్టపరిహారం పొందే అవకాశం లేకుండా పోయిందన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాశ్ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం జరిగింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చి రైతులకు దన్నుగా నిలిచారు. గాంధీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ పరిశీలకురాలు, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు తమ సమస్యలపై ఎన్నడూ రోడ్డు ఎక్కరని, రైతు అంటే సౌమ్యంగా ఉంటారని, అంటువంటి రైతులు తమ సమస్య పరిష్కారానికి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితులను ఈ ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రూ.260 ఉండాల్సిన యూరియా బస్తా.. కూటమి ప్రభుత్వ నిర్వాహక చర్యల మూలంగా రూ.600కు అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు 5 కె రన్



5కె రన్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులతో అధికారులు

అమలాపురం రూరల్: ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా మంగళవారం అమలాపురంలోని భట్నవిల్లి జంక్షన్ నుంచి రోళ్లపాలెం వరకూ 5 కె రన్ నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన డాక్టర్ భరత లక్ష్మి మాట్లాడుతూ జిల్లా యువతకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో 17 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసున్న 105 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పురుషులలో ప్రథమ బహుమతిని ఎస్.నాగేంద్ర మురళి (అమలాపురం ఎస్‌కేబీఆర్ డిగ్రీ కాలేజీ), ద్వితీయ బహుమతిని బీఎస్ఆర్ రాజు (కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ), మహిళల్లో ప్రథమ బహుమతిని జి.రమ్య (రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ), ద్వితీయ బహుమతిని వైపీఎన్‌డీ సంతోషి (కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ) గెలుపొందారు. కార్యక్రమంలో టీబీ అధికారి పి.బాలాజీ, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎ.బుజ్జిబాబు, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ ఎంవీ రత్నరాజు పాల్గొన్నారు.

అయినవిల్లికి రూ.66.68 లక్షల ఆదాయం

అయినవిల్లి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి రూ.66,68,257 ఆదాయం లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గ భవాని తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చవితి తొమ్మిది రోజులూ 1.80 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. అన్నదాన సత్రంలో 75 వేల మంది స్వామి అన్న ప్రసాదం స్వీకరించినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.15,16,469 పెరిగిందని ఆమె వివరించారు. దేవదాయశాఖ జిల్లా అధికారి వి.సత్యనారాయణ, ఆలయ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐఎండీ కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



వాతావరణశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లా ప్రజలు ప్రకృతి వైపరీత్యాల నుంచి జాగ్రత్త పడేందుకు వీలుగా భారత వాతావరణశాఖ (ఐఎండీ) కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు యోచన చేస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం భారత వాతావరణశాఖ అధికారులు భట్నవెల్లిలోని ఒనువులమ్మ దేవాలయం వద్ద సేకరించిన 50 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎండీ కార్యాలయం ఏర్పాటుకు 50 సెంట్లు స్థలం అనువుగా ఉందని అధికారులు అభిప్రాయపడ్డారన్నారు. ఈ కార్యాలయం ఏర్పాటు వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు అందుతాయన్నారు. తద్వారా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా అప్రమత్తం కావచ్చన్నారు. వర్షం, ఎండ, చలి, తుపానులు, వడగండ్ల వాన, భూకంపాల వంటి వాటికి ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.

అభివృద్ధికి బ్రేక్.. ఉపాధికి షాక్

- రాజోలు దీవిలో వంద ఆయిల్, గ్యాస్ బావులు
- ఉత్పత్తులను తరలిస్తున్న ఆయిల్ కంపెనీలు
- స్థానికులకు ప్రాధాన్యం కరవు
- బయటి వారికే పెద్దపీట
- యువతకు కొరవడిన ఉపాధి



ఇటీవల గ్యాస్ పైపులైన్ లీకేజీతో గొల్లపాలెంలో ఏర్పడిన గొయ్యి



రాజోలు దీవిలోని రోడ్లపై ఓఎన్జీసీ వాహనాల రాకపోకలు

మలికిపురం: రాజోలు దీవి నుంచి అపార చమురు, గ్యాస్ నిక్షేపాలను తరలించుకు పోతున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు ఇక్కడ పారిశ్రామిక అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో నిరుద్యోగం తాండవం చేస్తోందన్నారు. నిక్షేపాలు అధికంగా ఉన్న చోట అభివృద్ధిని సాధించాల్సింది పోయి, యువత ఉపాధి కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లోని సుమారు 100 బావుల ద్వారా ప్రతి రోజూ 20 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్, అదే స్థాయిలో చమురు నిక్షేపాలను ఓఎన్జీసీ, గెయిల్ తరలించుకు పోతున్నాయి. కానీ ఈ సంస్థలు ఈ ప్రాంతాల ప్రజలకు ఉపాధి చూపడంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ సంస్థల్లో ఇక్కడి వారికి సరైన ఉద్యోగాలు లేవు. ఆయా సంస్థల కార్యకలాపాల్లో కూడా సరియైన ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

పరిశ్రమలకు దక్కని ప్రాధాన్యం

రాజోలు దీవిలో గతంలో పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వాటిలో తూర్పుపాలెంలో ఐస్ ఫ్యాక్టరీ, ఐరన్ ఫ్యాక్టరీ, అలాగే తూర్పుపాలెంతో పాటు కేశవదాసుపాలెంలో విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అప్పట్లో వాటికి లోప్రెజర్ గ్యాస్‌ను తక్కువ ధరకు అందించేవారు. భవిష్యత్తులో గ్యాస్ మరింత అందిస్తారని, రాయితీ కూడా వస్తుందని నిర్వాహకులు ఆశించారు. అయితే రాను రాను పరిస్థితి దిగజారింది. గ్యాస్ సరఫరాను పెంచలేదు, రాయితీ ఇవ్వలేదు సరికదా, అప్పటి వరకూ సరఫరా చేసిన గ్యాస్ ధరను అమాంతంగా పెంచేశాయి. దీంతో అసలే అంతంత మాత్రంగా నడుస్తున్న ఆయా పరిశ్రమలను యజమానులు మూసివేశారు. తూర్పుపాలెం ఐస్ ఫ్యాక్టరీతో పాటు, విద్యుత్, స్టీల్ పరిశ్రమలు, కేశవదాసుపాలెంలో విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమ మూతబడ్డాయి. దీంతో నిర్వాహకులు రూ.కోట్లు నష్టపోయారు. స్థానిక యువత ఉపాధి లేక సతమతమవుతున్నారు. స్థానిక పరిశ్రమలకు రాయితీలు, గ్యాస్ సరఫరా చేయని ఆయా సంస్థలు.. ఇతర చోట్ల పరిశ్రమలకు ఇవ్వడం దారుణమైన అంశమని స్థానికులు మండిపడుతున్నారు. లోప్రెజర్ గ్యాస్‌ను తక్కువ ధరకు నియోజకవర్గంలో పరిశ్రమలకు అందించని ఒక సంస్థ.. ఇటీవల రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కంపెనీకి శివకోడులోని ఓ బావిని ధారాదత్తం చేయడం గమనించదగ్గ విషయం.

వరస లీకేజీలు

రాజోలు దీవిలో వారానికోసారి గ్యాస్, ఆయిల్ బావులు లీకవుతాయి. ప్రజలు బెంబేలెత్తి, తీవ్ర భయాందోళనలు చెందుతారు. కానీ ఆయా సంస్థలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తాయి. శిథిలమైన పైపులైన్లు, బావుల పరికరాలకు మరమ్మతులు చేయపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కనీసం ఓఎన్జీసీ కార్యకలాపాల పనులు, కాంట్రాక్టులు కూడా ఆయా సంస్థలో పరిచయం, పలుకుబడి ఉన్న ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల సంస్థలు, వ్యక్తులకే ఇస్తున్నారనే వాదన ఇక్కడ బలంగా ఉంది.

అనేక నష్టాలు

రాజోలు దీవిలో గ్యాస్, చమురు నిక్షేపాలను తరలించుకుపోవడంతో ఈ ప్రాంతం గుల్లవుతోంది. ఇక్కడి భూసారంతో పాటు పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయి. అలాగే గ్యాస్‌ను తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తరచూ పైపులైన్ల లీకేజీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంత నష్టం జరుగుతున్నా ఈ ప్రాంతంలో అభివృద్ధికి ఆయిల్ కంపెనీలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

క్లుప్తంగా

రాజమహేంద్రవరం - కాకినాడ మధ్య స్పెషల్ రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం - కాకినాడ పోర్టు మధ్య ప్రతి రోజు అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. కాకినాడ పోర్టు - రాజమహేంద్రవరం (07523) రైలు ఈ నెల 15 నుంచి, రాజమహేంద్రవరం - కాకినాడ పోర్టు (07524) రైలు ఈ నెల 16 నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. ఇవి రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, మేడపాడు, సామర్లకోట, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్లలో ఆగుతాయని వివరించారు. ఒక రైలు రాజమహేంద్రవరంలో తెల్లవారుజాము మూడు గంటలకు బయలుదేరి 4.40 గంటలకు కాకినాడ పోర్టు చేరుకుంటుందన్నారు. మరో రైలు కాకినాడలో ఉదయం 6.15 గంటలకు బయలుదేరి 8.15 గంటలకు రాజమహేంద్రవరం వస్తుందన్నారు.

పింక్ మూన్‌తో 'నన్నయ' ఒప్పందం

రాజానగరం: పింక్ మూన్ టెక్నాలజీ సంస్థతో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. దీనికి సంబంధించిన పత్రాలపై మంగళవారం వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, టెక్నాలజీ సంస్థ సీఈఓ టి.నాగమల్లేశ్వరరావు సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా యూనివర్సిటీలోని అన్ని ఐటీ, సాఫ్ట్‌వేర్ ప్రక్రియలకు సాంకేతిక మద్దతు, కన్సల్టెన్సీ, పరిష్కారాలు అందిస్తుందన్నారు.

రూ.1.15 లక్షల ఎరువుల సీజ్



మాచవరంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

అంబాజీపేట: నిబంధనలకు వ్యతిరేకంగా నిల్వ ఉంచిన రూ.1.15 లక్షల విలువైన 5.20 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాజమహేంద్రవరం డీఎస్పీ ఎస్.తాతారావు, మండల వ్యవసాయ అధికారి కె.ధర్మ ప్రసాద్ తెలిపారు. మాచవరంలోని సుభాషణ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని రాజమహేంద్రవరానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులతో కలిసి మండల వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.1,15,370 విలువైన ఎరువులను సీజ్ చేశారు. తనిఖీలో డీసీటీవో ఎ.నవీన్ కుమార్, కానిస్టేబుల్ శివకుమార్, ఏఈఓ జాజెబ్ శాస్త్రి పాల్గొన్నారు.

గాలికుంటు.. తరిమికొట్టు

- 15 నుంచి వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం
- జిల్లాకు చేరుకున్న 1.25 లక్షల డోసులు
- వర్షాకాలంలో వ్యాధి తీవ్రత ఎక్కువ





పాడి-పంట

రాయవరం: గ్రామీణ ప్రాంతాల్లో పాలాలు దున్నాలన్నా, దుక్కి చేయాలన్నా ఎద్దులు, దున్నల అవసరం తప్పనిసరి. వీటితో పాటు పాడి పశువులు బాగుంటేనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. అయితే ఎద్దులు, దున్నలు, ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) సోకే ప్రమాదం ఉంది. వైరస్ కారణంగా వచ్చే ఈ వ్యాధి ప్రభావం వర్షాకాలంలో అధికంగా ఉంటుంది. దీని బారిన పడిన పశువుల్లో ఉత్పాదకత తగ్గిపోతుంది. తద్వారా పశు పోషకులకు తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుంది. అయితే సరైన చికిత్సా విధానాలు పాటిస్తే పశువులు, జీవాలను ఈ వ్యాధి బారి నుంచి కాపాడుకోవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు.

వ్యాధి లక్షణాలు

- గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేవు.
- ఈ వ్యాధికి గురైన గేదె, మేక, గొర్రె వంటి జీవాల్లో తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది. పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కాళ్లు కుంటడం, నోటి నుంచి విపరీతంగా నురగ కారడం వంటి లక్షణాలు ఉంటే గాలికుంటు వ్యాధి సోకినట్టు గుర్తించాలి.
- ఆగస్టు, సెప్టెంబర్, మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. దీని వల్ల మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు పెరిగిన పశువులు నీరసిస్తాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.
- నోటి ఎపిథీలియం (పైపొర), పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడతాయి. అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులు నొప్పితో మేత తినవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కొక్కసారి పొదుగువాపు సంభవిస్తుంది. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండవేడిమికి తట్టుకోలేక నీరసిస్తాయి.

వ్యాప్తి చెందే విధానం

నోరు, కాలు వ్యాధికి గురైన పశువుల అంతస్రావాల (లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి) వల్ల మిగతా పశువులకు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

జిల్లాలో పరిస్థితి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,65,368 పశువులు ఉన్నాయి. వీటికి 7వ రౌండ్ బూస్టర్ డోస్ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ ఉచితంగా వేయనున్నారు. అక్టోబర్ 15 నుంచి నెలాఖరు వరకు ఏడాది లోపు దూడలకు బూస్టర్ డోస్ వేస్తారు. జిల్లాకు 1.65 లక్షల డోసులు అవసరం కాగా, 1.25లక్షల డోసులు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. గతంలో 40 వేల డోసుల నిల్వలు ఉన్నాయి.

టీకాలు తప్పనిసరి



గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువైద్యశాఖ ద్వారా ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ జిల్లాలో ఉచితంగా వేయనున్నారు. వీటిని పశువులు, జీవాలకు తప్పనిసరిగా వేయించాలి.

– డాక్టర్ కె.వెంకట్రావు, డీఏహెచ్‌వో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నివారణ ఇలా..

పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్ల వలన మేత మేయవు కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి. జావ, జొన్న, అన్నం, బెల్లంతో కలిపి ప్రతిరోజూ తాగించడం ద్వారా బలహీన పడకుండా జాగ్రత్త వహించాలి. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. వాటి మలమూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన వాటిని సుమారు మూడు నెలల వరకు సంపర్కానికి వినియోగించకూడదు. కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి రాయాలి. వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

క్లోరిన్ గ్యాస్ లీకై పలువురికి అస్వస్థత

యానాం: కనకాలపేట రక్షిత తాగునీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మంగళవారం సాయంత్రం క్లోరిన్ గ్యాస్ లీక్ కావడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) ఆధ్వర్యంలో కనకాలపేటలోని ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి పలు గ్రామాలకు తాగునీరు అందిస్తుంటారు. ఈ నీటిని శుభ్రపరిచేందుకు సుమారు 900 కేజీల క్లోరిన్ గ్యాస్ సిలిండర్‌ను ప్రతి మూడు నెలలకు ఒక్కసారి మార్చాలి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సిబ్బంది సిలండర్‌ను మార్చుతుండగా ఒక్కసారిగా దానిలోంచి గ్యాస్ లీకై బయటకు వ్యాపించింది. దీంతో అక్కడే ఉన్న సుమారు తొమ్మిది మంది సిబ్బంది బయటకు పరుగులు తీశారు. కనకాలపేటలోని కోనవారివీధి, పాతబడివీధి, జమ్ముబాడువ తదితర గ్రామాల్లోకి గ్యాస్ వ్యాపించడంతో దాని వాసనకు పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఊపిరి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీడబ్ల్యూడీ ఈఈ నాగరాజు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. అనంతరం నాగరాజు, జేఈ పెదపాటి సంతోష్, గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు వచ్చిన ఫైర్‌మన్ కోన కృష్ణారావు (బాబీ) తదితర తొమ్మిది మంది సిబ్బందితో పాటు 18 మంది గ్రామస్తులు అస్వస్థతకు గురయ్యారు. వారిని జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో బాధితులను ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏవో అంకిత్ కుమార్ పరామర్శించారు. గ్యాస్‌లీక్‌ను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



క్లోరిన్ గ్యాస్‌ను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



జీజీహెచ్‌లో బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్టు

రామచంద్రపురం: కె.గంగవరం మండలం అద్దంపల్లి సమీపంలో ఈనెల 3న దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ఎం.వెంకట నారాయణ వెల్లడించారు. పట్టణంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ద్రాక్షారామకు చెందిన యండమూరి శ్రీనివాస్ ఈ నెల 3న తాను పనిచేస్తున్న నగల దుకాణాన్ని మూసివేసి సుమారు రాత్రి 11 సమయంలో తిరిగి ఇంటికి వెళుతున్నాడు. అద్దంపల్లి గ్రామం దేవాంగుల శ్మశాన వాటిక సమీపానికి వచ్చేసరికి ఇద్దరు వ్యక్తులు ఆటోలో వచ్చి అతడిని ఇనుప పైపుతో కొట్టి కళ్లలో కారం చల్లారు. సుమారుగా 10 గ్రాముల పాతబంగారం, సెల్‌ఫోన్ రూ.5 వేలు, షాపునకు సంబంధించిన రశీదులు, స్కూటర్‌తో పాటు సుమారు రూ.78 వేలు విలువైన వస్తువులు దోచుకుపోయారు. దొంగలకు మరో వ్యక్తి సాయం చేశాడు. ఈ మేరకు ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ రఘువీర్ ఆదేశాల మేరకు సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు. తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఏరియా బైపాస్ రోడ్డులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిని తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన ఓలేటి సత్తిబాబు, సంగాడి రాజు, పత్తిగొంది గ్రామానికి చెందిన కళ్లేపల్లి ప్రసాద్‌గా గుర్తించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట నారాయణ

విద్యుత్ షాక్‌తో సెంట్రింగ్ కూలీ మృతి

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామానికి చెందిన సెంట్రింగ్ కూలి వాసంశెట్టి శ్రీనివాస్ (30) పని ప్రదేశంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. శ్రీనివాస్ మరో ఇద్దరు కూలీలతో కలిసి మంగళవారం పడమర ఖండ్రిక గ్రామంలో ఇంటి శ్లాబ్ సెంట్రింగ్ పనికి వెళ్లాడు. శ్రీనివాస్ ఆ భవనం కింది నుంచి ఊసను పైకి లాగుతుండగా 11 కేవీ వైర్లకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వి.శ్రీనివాస్, జి.శివకృష్ణలకు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరినీ తొలుత కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి, తర్వాత రాజమహేంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అంగర ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపారు.



శ్రీనివాస్ మృతదేహం

వ్యాన్ కింద పడి..

ముమ్మిడివరం: ఠానేల్లంక ప్రధాన రహదారిపై రాజుపాలెం వద్ద మంగళవారం కొబ్బరి డొక్కల లోడుతో వెళుతున్న వ్యాన్ కింద పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కూనాలంకకు చెందిన కొప్పిశెట్టి గంగరాజు (45) మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం వెళుతున్నాడు. రాజుపాలెం వద్ద ముమ్మిడివరం వైపు వెళుతున్న వ్యాన్‌ను తప్పించబోయి దాని కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గంగరాజుకు భార్య రాజేశ్వరి, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని..

గండేపల్లి: మల్లేపల్లికి చెందిన మడపాటి సూరిబాబు (34) తాళ్లూరు సమీపంలోని సామిల్లు వద్ద తాపీపనికి వెళ్లాడు. అక్కడ రోడ్డు పక్కన నిలుచున్న అతడిని విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గండేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడీలు లేని కాలేజీలపై చర్యలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీలలో ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ) తప్పనిసరిగా ఉండాలని, లేని కాలేజీలపై తగిన చర్యలు తప్పవని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ హెచ్చరించారు. అలాగే యూనివర్సిటీ పరంగా నిర్వహించే కార్యక్రమాలకు గైర్హాజరయ్యే కాలేజీలపై కూడా చర్యలు తీసుకుంటాయన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో మంగళవారం స్పోర్ట్సు బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుబంధ కాలేజీలు సుమారు 400 వరకు ఉండగా, వాటిలో చాలావరకు పీడీలు లేకపోవడం విచారకరమన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతోపాటు పోటీలలో పాల్గొనే విధంగా అవసరమైన తర్ఫీదునివ్వడంలో పీడీల పాత్ర విశిష్టమైనదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, సీడీసీ డీన్ డాక్టర్ ఎ.మట్టారెడ్డి, పీఈడీ అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు.

11 నుంచి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 క్రీడా పోటీల షెడ్యూలు ఖరారు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని క్రీడాకారులకు జిల్లా క్రీడామైదానం (డీఎస్ఏ)లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ ప్రకారం..

- అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో ఈ నెల 11న ఆర్చరీ, ఫుట్కా, సపక్ తక్రా పోటీల్లోనూ, ఈ నెల 15న సాఫ్ట్ టెన్నిస్, జుడో, రైఫిల్ షూటింగ్ పోటీలు, అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయి.
- 16న అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో టెన్నిస్, జిమ్నాస్టిక్స్ (అండర్-14, 17, 19), అండర్-17 బాలురు, బాలికల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహిస్తారు.
- 17న అండర్ 14, 17, బాలురు, బాలికలకు టేబుల్ టెన్నిస్, రగ్బీ, పీఆర్‌జీ హైస్కూల్లో నెట్‌బాల్ ఎంపికలు, 18న అండర్ 14 17 విభాగంలో స్విమ్మింగ్, రెజ్లింగ్, స్క్వాష్ ఎంపికలు జరుగుతాయి.
- 19న అండర్ 17 బాలురు, బాలికల మోడ్రన్ పెంటాథలాన్, అండర్ 14, 17 బాలురు, బాలికల సైక్లింగ్, రోడ్ ట్రాక్ పోటీలు డీఎస్‌ఏ మైదానంలో నిర్వహిస్తారు. స్కేటింగ్, తంగట, బాక్సింగ్‌లు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ పాఠశాలలోనూ, బీచ్ వాలీబాల్ పోటీలు కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లోను నిర్వహిస్తారు. అండర్ 14 ఫుట్‌బాల్ బాలురు, బాలికల ఎంపికలు, అండర్ 14, 17 తైక్వాండో, కురాష్, ఉషు, కరాటే పోటీలను రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ పాఠశాల, మాల్కంబ్ పోటీలను జెడ్పీహెచ్ఎస్ గుడిమిలంక, కోనసీమ జిల్లాలో జరుగుతాయి. వివరాలకు 96035 04347 నంబర్‌ను సంప్రదించాలి.